సాక్షి
యాదాద్రి భువనగిరి
బుధవారం ǀ 4 ǀ జూన్ ǀ 2025



కల సాకారం కాబోతోంది

ఆలేరు ప్రజల కల సాకారం కాబోతోం దని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. - 8లో



యూట్యూబ్‌లో చూసి..

యూట్యూబ్‌లో చూసి నకిలీ పత్తి విత్తనాలు తయారు చేస్తున్న ముఠాను సూర్యాపేట పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 38°/27°

పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు ఆలేరు ముసాయిదా ఓటరు జాబితా

సాక్షి, యాదాద్రి : ఆలేరు మున్సిపల్ ముసాయిదా ఓటరు జాబితా బుధవారం విడుదల కానుంది. మున్సిపాలిటీలోని 2వ వార్డు సాయిగూడెం గ్రామ పంచాయతీగా మారింది. దీంతో 800కుపైగా ఓట్లు తగ్గాయి. నూతన ముసాయిదా ప్రకారం మొత్తం పన్నెండు వార్డుల్లో 13,526 ఓట్లు మున్సిపాలిటీలో ఉండగా ఆరు వార్డుల్లో గతంలో ఉన్న ఓట్లు తగ్గగా, మరో ఆరు వార్డుల్లో స్వల్పంగా పెరిగాయి. విభజనపై ఏమైనా అభ్యంతరాలుంటే ఈనెల 11 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. 12 నుంచి 16 వరకు అభ్యంతరాలు పరిశీలించి, 21న వార్డుల విభజనపై తుది నోటిఫికేషన్ జారీ కానుంది.

క్షేత్రపాలకుడికి క్షీరాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామిఆలయానికి క్షేత్రపాలకుడిగా ఉన్న శ్రీఆంజనేయస్వామికి అర్చకులు మంగళవారం ఆకుపూజను విశేషంగా నిర్వహించారు. ఆంజనేయస్వామికి ఇష్టమైన రోజు కావడంతో ప్రధానాలయంతో పాటు విష్ణు పుష్కరిణి వద్ద, పాతగుట్ట ఆలయాల్లో సింధూరంతోపాటు పాలతో అభిషేకించారు. అనంతరం తమలపాకులతో అర్చన జరిపించారు. హనుమంతుడికి ఇష్టమైన నైవేద్యాన్ని సమర్పించి, భక్తులకు ప్రసాదంగా అందజేశారు. ఇక ప్రధానాలయంలో నిత్య పూజలు సంప్రదాయంగా జరిగాయి. శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం జరిపించి, సాయంత్రం వెండి జోడు సేవలు వంటి పూజలు కొనసాగాయి.

క్షయ రహిత జిల్లాగా మారుద్దాం



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ మనోహర్

తుర్కపల్లి : జిల్లాను క్షయ వ్యాధి రహితంగా మార్చేందుకు ఆరోగ్య సిబ్బంది, ఆశావర్కర్లు అంకితభావంతో పనిచేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ మనోహర్ అన్నారు. క్షయ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా తుర్కపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం మొబైల్ టీబీ డయాగ్నోస్టిక్ వాహనం ద్వారా వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో టీబీతో బాధపడుతున్న వారిని గుర్తించి తక్షణ చికిత్స, మందులు అందించాలన్నారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాయిశోభ, డాక్టర్ రుచిరా, సీహెచ్‌ఓ రాజయ్య, ఎంపీహెచ్‌ఏ సునిల్‌కుమార్, పీహెచ్‌ఎన్ బిస్మిల్లా, ఎంఏ జానిపాష, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిబంధనలు పాటించాలి

భువనగిరి : జిల్లాలోని ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలలు పేరు ముందు ఒలింపియాడ్, టెక్నో, జేఈఈ, ఐఐటీ, కోచింగ్, స్పెషల్ క్లాసులు వంటి పదాలను నమోదు చేయకుండా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని డీఈఓ సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కామన్‌బోర్డు జారీ చేసిన ప్రశ్న పత్రాలు మాత్రమే ఉపయోగించాలని పేర్కొన్నారు. విద్యార్థుల రవాణాకు ఉపయోగించే బస్సులు, ఆటోలు పూర్తిగా ఫిట్‌నెస్ ఉన్నట్లు ధ్రువీకరణ పత్రం పొంది ఉండాలని తెలిపారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులతోనే బోధన చేయించాలని, ఉపాధ్యాయుల పేర్లు, ఫొటో, వివరాలతో కూడిన పట్టికను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ ని బంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థుల భాగస్వామ్యంతో నాణ్యమైన విద్య

నల్లగొండ టూటౌన్ : విద్యార్థుల భాగస్వామ్యంతోనే నాణ్యమైన విద్య అందించడం, సంస్కరణలు అమలు చేయడం సాధ్యమవుతుందని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేసవికాలం సెలవులు జూన్ 1వ తేదీతో ముగిసినందున, విద్యార్థులంతా తిరిగి యూనివర్సిటీలో తరగతులకు హాజరు కావాలని సూచించారు. యూనివర్సిటీలోని నాలుగు కళాశాలల్లో తరగతులు, వసతి గృహాలు ప్రారంభమయ్యాయని వీసీ తెలిపారు.

• భక్తజన సందోహం



యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వచ్చిన భక్తులు మంగళవారం ఆలయ పరిసరాల్లో ఇలా సేదదీరుతూ కనిపించారు. - యాదగిరిగుట్ట

దరఖాస్తులు స్వీకరించాలి

భువనగిరిటౌన్: ఆసరా పింఛన్ల మంజూరునకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించాలని జిల్లా అదనపు కలెక్టర్ వీరారెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలు, వితంతు పెన్షన్ ప్రతిపాదనలపై సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ జిల్లా అదనపు కలెక్టర్‌లు, డీఆర్‌డీఓలు, రెవెన్యూ అధికారులతో జూమ్ సమావేశం ద్వారా సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడారు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలు, వృద్ధాప్య పెన్షన్లకు దరఖాస్తుల స్వీకరించే ప్రతిపాదన రూపొందించాలన్నారు.

దొడ్డిదారిలో.. దొడ్డుబియ్యం

ఆలేరులో రూ.10 లక్షల విలువైన బియ్యం మాయం

ఆలేరు ఎంఎల్ఎస్ పాయింట్‌లో దొడ్డుబియ్యం అమ్ముకున్న విషయం ఇటీవల బయటపడింది. రూ.10 లక్షల విలువ చేసే బియ్యాన్ని సదరు గోదాము ఇన్‌చార్జ్, డాటా ఎంట్రీ ఆపరేటర్ వేర్వేరుగా ఎవరికి వారే బ్లాక్ మార్కెట్‌కు తరలించి అమ్ముకున్నారు. అయితే గోదాము ఇన్‌చార్జ్ ఇటీవల బదిలీ అయితే ఆయన స్థానంలో మరో అధికారికి బాధ్యతలు అప్పగించారు. కొత్తగా వచ్చిన అధికారి బియ్యం నిలవల్లో తేడాను గుర్తించి డీఎంకు తెలిపారు. దీంతో అధికారులు విచారణ ప్రారంభించారు. అయితే అక్రమాలకు పాల్పడిన అధికారి బదిలీ కావడం, ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తుండడంతో దొడ్డు బియ్యం జాడ దొరకలేదు. దీంతో దొడ్డు బియ్యాన్ని అమ్ముకున్నట్టు తేలింది. ఇలాంటి ఘటనలు అక్కడక్కడా జరుగుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- అధికారుల విచారణలో వెలుగు చూసిన వాస్తవం
- పలు చోట్ల పక్కదారి పడుతున్న దొడ్డుబియ్యం
- రేషన్ దుకాణాల్లో భారీగా నిల్వలు
- సన్నబియ్యం నిల్వకు స్థలంలేక ఇబ్బందులు



భువనగిరి పట్టణంలోని రేషన్ దుకాణంలో నిల్వ ఉన్న దొడ్డు బియ్యం బస్తాలు

సాక్షి, యాదాద్రి : రేషన్ దుకాణాల ద్వారా ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తుండడంతో గతంలో మిగిలిపోయిన దొడ్డు బియ్యం నిల్వలు దొడ్డిదారి పడుతున్నాయి. సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం ప్రారంభించే నాటికి రేషన్ దుకాణాలు, సివిల్ సప్లైగోదాములు, ఎంఎల్ఎస్ పాయింట్లలో నిల్వ ఉన్న దొడ్డు బియ్యం అక్రమార్కులకు ఆదాయ వనరుగా మారాయి. ఆలేరు, భువనగిరి, చౌటుప్పల్, రామన్నపేట, మోత్కూరు ఎంఎల్ఎస్ పాయింట్లు ఉన్నాయి. ఇందులో ఆలేరు, చౌటుప్పల్ ఎంఎల్ఎస్ పాయింట్లలో బియ్యం పక్కదారి పడుతున్నాయి. దీంతోపాటు అక్కడక్కడా రేషన్ దుకాణాల్లో ఉన్న దొడ్డు బియ్యం నిల్వలు మాయమవుతున్నాయి. అయితే రేషన్ దుకాణాల్లో ఉన్న దొడ్డు బియ్యం నిల్వలను వెంటనే గోదాములకు తరలించాలని రేషన్ షాపుల డీలర్లు కోరుతున్నారు.

దొడ్డుబియ్యం నిల్వలు (మెట్రిక్ టన్నుల్లో..)	
రేషన్ దుకాణాల్లో	1,100
ఎంఎల్ఎస్ పాయింట్లలో	185
బఫర్ గోదాములలో	347
రేషన్ దుకాణాల సంఖ్య	515
ఎంఎల్ఎస్ గోదాములు	05

దొడ్డుబియ్యం నిల్వలతో ఇబ్బందులు

ఉగాది పండుగ నుంచి ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ నేపథ్యంలో షాపులు, ఎంఎల్ఎస్ పాయింట్లు, గోదాముల్లో ఉన్న దొడ్డు బియ్యం నిలవలతో ఇబ్బందులు తప్పడం లేదు. ప్రస్తుతం ఇస్తున్న మూడు నెలల రేషన్ బియ్యాన్ని నిల్వ చేయడానికి కూడా స్థలం సరిపోవడంలేదు. దీనికితోడు నిల్వ ఉన్న దొడ్డుబియ్యానికి తెల్లపురుగు, లక్క పురుగు పట్టడం, ముక్కిపోవడం, తుట్టెలు కట్టి ఎందుకు పనిరాకుండా పోతున్నాయి. ఎలుకలు తినడం, గోనె సంచుల నుంచి కారిపోతున్నాయి. మరోవైపు సన్నబియ్యం వస్తుండడంతో దొడ్డు బియ్యానికి పట్టిన పురుగులు సన్నబియ్యానికి పట్టే అవకాశం ఉందని డీలర్లు వాపోతున్నారు.

దొడ్డుబియ్యం నిల్వలు 1,632 మెట్రిక్ టన్నులు

అధికారుల లెక్కల ప్రకారం జిల్లాలో ఎంఎల్ఎస్ పాయింట్లు, బఫర్ గోదాములు, రేషన్ దుకాణాల్లో మొత్తం 1,632 మెట్రిక్ టన్నుల దొడ్డుబియ్యం నిల్వలు ఉన్నాయి. అయితే ప్రస్తుతం రేషన్ షాపుల్లో సన్నబియ్యం పంపిణీతో దొడ్డు బియ్యానికి డిమాండ్ పెరిగింది. ప్రధానంగా హోటళ్లలో దోశలు పోయడానికి గతంలో రేషన్ బియ్యాన్ని వాడే వారు. ఇదే క్రమంలో అవే బియ్యం అక్కడక్కడ లభిస్తుండడంతో వ్యాపారులు చాటుమాటుగా కొనుగోలు చేస్తున్నారు.

ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం

ఆలేరు గోదాంలో బియ్యం తేడాపై విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక పంపాము. అక్రమంగా తరలిస్తున్న వారి వద్ద పట్టుకున్న బియ్యాన్ని సీజ్ చేసి గోదాములో నిల్వ చేసి వాటినే అమ్ముకున్నట్లు గుర్తించాం. అమ్ముకున్న దొడ్డు బియ్యం విలువ సుమారు రూ.10 లక్షలు ఉంటుంది. పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు దొడ్డు బియ్యం నిల్వలు ఏం చేయాలో నిర్ణయం తీసుకుంటాం.

– హరికృష్ణ, సివిల్‌సప్లయ్ డీఎం

సీఎం పర్యటన ఏర్పాట్లు పక్కాగా ఉండాలి

- కలెక్టర్ హనుమంతరావు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

సాక్షి, యాదాద్రి : జిల్లాలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడానికి ఈ నెల 6న సీఎం రేవంత్‌రెడ్డి వస్తున్న సందర్భంగా అధికారులు పక్కా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా మంగళవారం భువనగిరి కలెక్టరేట్‌లోని మినీ మీటింగ్ హాల్‌లో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని శాఖల అధికారులు సంపూర్ణ సమన్వయంతో పనిచేయాలన్నారు. పోలీస్ బందోబస్తు పకడ్బందీగా ఉండాలన్నారు. అగ్నిమాపక పరికరాలు, సేవలను అందుబాటులో ఉంచాలని, అవసరమైన వైద్య ఏర్పాట్లు చేయాలని అగ్నిమాపక, ఆరోగ్య శాఖలకు సూచించారు. అలాగే వివిధ శాఖలు చేయాలని పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, జెడ్పీ సీఈఓ శోభారాణి, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, కలెక్టరేట్ ఏఓ జగన్మోహన్ ప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతురావు

తుర్కపల్లి : భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని కలెక్టర్ హనుమంతురావు అన్నారు. మంగళవారం తుర్కపల్లి మండలం నాగాయిపల్లి, గోపాలపురం గ్రామాల్లో భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలపురంలో సదస్సును కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులను వచ్చిన దరఖాస్తుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతులతో మాట్లాడారు. అనంతరం తిరుమలాపురం గ్రామంలో ఈనెల 6న జరగనున్న అభివృద్ధి పనుల శంకుస్థాపనలకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దేశ్యానాయక్, డీటీ కల్పన, ఆర్ఐ జహంగీర్, రఘురామారావు, సర్వేయర్ శ్రీనివాస్, పుండరీకం, చరణ్ సింగ్, తేజశ్విని, కార్యదర్శి బాలరాజు, నాయకులు ధనావత్ శంకర్‌నాయక్, చాడ భాస్కర్‌రెడ్డి, కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి, సోన్నాయిల రఘు, రైతులు, మాన్‌సింగ్, రహీమత్ షరీఫ్, పెద్దులు, మెరుగు కృష్ణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భద్రత కట్టుదిట్టం చేయాలి

- డీసీపీ ఆకాంక్ష్ యాదవ్



ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న డీసీపీ ఆకాంక్ష్ యాదవ్, ఏసీపీ శ్రీనివాస్‌నాయుడు తదితరులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ భద్రత ఏర్పాట్లు కట్టుదిట్టం చేయాలని డీసీపీ ఆకాంక్ష్ యాదవ్ అన్నారు. ఇటీవల ఆలయ ప్రసాద విక్రయశాలలోని గోదాములో చింతపండు దొంగతనం జరిగిన నేపథ్యంలో మంగళవారం ఆయన ప్రధానాలయంతో పాటు ఆలయ క్యూకాంప్లెక్స్, క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల, మాఢ వీధిల్లో పర్యటించి, ఎస్‌పీఎఫ్, హోంగార్డుల పనితీరును పరిశీలించారు. పలు వివరాలను ఎస్‌పీఎఫ్ ఆర్ఐ శేషగిరిరావును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆయన వెంట అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ, సిటీ సెక్యూరిటీ టీమ్ అడిషనల్ డీసీపీ వినోద్‌కుమార్, ఏసీపీ శ్రీనివాస్‌నాయుడు, టౌన్ సీఐ బి.భాస్కర్, రూరల్ సీఐ శంకర్‌గౌడ్, సీఎస్‌డబ్ల్యూ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, ఎస్‌పీఎఫ్ ఆర్ఐ శేషగిరిరావు, డీఈవో భాస్కర్, ఆలయాధికారులు దయాకర్‌రెడ్డి, రామారావు, శ్రీనివాస్‌రెడ్డి, సిటీ సెక్యూరిటీ టీమ్ అధికారులు ఉన్నారు.

నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలి

- జిల్లా వ్యవసాయాధికారి గోపాల్



రైతులకు విత్తన ప్యాకెట్లు అందజేస్తున్న డీఏఓ

భూదాన్‌పోచంపల్లి: వానాకాలం పంటల సాగుకు రైతులు నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి (డీఏఓ) గోపాల్ అన్నారు. మంగళవారం భూదాన్‌పోచంపల్లి మండలం భీమనపల్లి రైతువేదికలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రైతులకు విత్తన కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ప్రతి గ్రామానికి నాణ్యమైన విత్తనం' కార్యక్రమంలో భాగంగా రైతులకు కేఎస్ఎం 1638 వరి, ఎంజీజీ 385 పెసర విత్తన కిట్లను అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ నీలిమ, మండల వ్యవసాయాధికారిణి ఎ.శైలజ, ఏఈఓలు శ్వేత, ప్రియాంక, స్వప్న, నరేశ్, రాజేశ్, క్రాంతి, పవిత్రన్, రైతులు పాల్గొన్నారు.

• మట్టి కుప్పలు.. ట్రాఫిక్ తిప్పలు!



ఆలేరు పట్టణంలో రైల్వేగేట్ వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) నిర్మిస్తున్నారు. పనుల్లో భాగంగా ఇక్కడ కొన్ని రోజుల క్రితం గుంతలు తవ్వి మట్టిని రోడ్డు పక్కనే పోశారు. దాంతో రోడ్డు ఇరుకుగా మారి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. ట్రాఫిక్ ఎక్కువగా ఉన్నప్పుడు, వర్షాలు కురిసినప్పుడు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మట్టి కుప్పలు తొలగించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. - ఆలేరు

పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

భువనగిరి : జిల్లాలో పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల గంజ్‌లో ఏర్పాటు కేంద్రంలో తొలిరోజు తెలుగు పరీక్ష జరిగింది. ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు జరిగిన పరీక్షకు 89 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 72 మంది హాజరయ్యారు. కాగా 17 మంది గైర్హాజరైనట్లు డీఈఓ సత్యనారాయణ తెలిపారు.

పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

- ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి
- భువనగిరిలో కలెక్టర్‌తో కలిసి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేత



లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్, అదనపు కలెక్టర్

భువనగిరిటౌన్ : ఇందిరమ్మ పథకం కింద ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల ఆర్థిక సహాయం చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు అండగా ఉంటోందని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. భువనగిరి పట్టణంతోపాటు మండలంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన 1,200 మంది లబ్ధిదారులకు మంగళవారం జిల్లా కేంద్రంలోని ఏకే ప్యాలెస్‌లో జిల్లా కలెక్టర్ హనుమంతరావు, అదనపు కలెక్టర్ భాస్కరరావుతో కలిసి ప్రొసీడింగ్ కాపీలను అందజేసి మాట్లాడారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో హామీలు తప్ప అమలు చేసింది శూన్యమని ఆరోపించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించి లబ్ధిదారులకు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయడంతో ఇప్పుడు అవి కూలిపోయే దశలో ఉన్నాయన్నారు. కాంగ్రెస్ ప్రజాపాలనలో ఇళ్లులేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుండడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇసుక కొరత లేకుండా ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ పడుతుందన్నారు. ఇళ్ల లబ్ధిదారులు ఈ నెల 9వ తేదీలోపు ముగ్గు పోసుకు భూమిపూజ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు సూచించారు. బేస్మెంట్ పూర్తి చేసుకున్న వెంటనే ప్రభుత్వం మీ ఖాతాల్లో లక్ష రూపాయలు జమ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేజ్ చిస్తీ, ఎస్సీ కార్పొరేషన్ శ్యామ్ సుందర్, హౌసింగ్ పీడీ విజయ్‌సింగ్, ప్రజా ప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

150 బస్సులు.. ఫిట్‌లెస్

- సామర్థ్య పరీక్షలు పూర్తయినవి 198
- స్కూళ్ల పునఃప్రారంభానికి దగ్గర పడుతున్న గడువు
- నిబంధనల ప్రకారం ముందస్తు పరీక్షలు తప్పనిసరి
- ఆసక్తి చూపని ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు



ఫిట్‌నెస్ పరీక్షల కోసం జిల్లా రవాణా శాఖ కార్యాలయం వద్దకు వచ్చిన స్కూల్ బస్సులు

భువనగిరి : ఈ విద్యాసంవత్సరం పునఃప్రారంభానికి సమయం దగ్గరపడుతున్నా జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలకు చెందిన బస్సులకు ఫిట్‌నెస్ (సామర్థ్య) పరీక్షలు చేయించుకునేందుకు యాజమాన్యాలు ఆసక్తి చూపడంలేదు. నిబంధనల ప్రకారం విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే బడి బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించి ఆర్టీఏ కార్యాలయం నుంచి ధ్రువీకరణ పత్రాలు పొందాల్సి ఉంది. అయితే జిల్లావ్యాప్తంగా ప్రైవేట్ విద్యాసంస్థలకు చెందిన బస్సులు 370 వరకు ఉన్నాయి. ఇందులో 15 ఏళ్ల కాల పరిమితి దాటిన వాటితోపాటు తుక్కు కింద వెళ్లినవి దాదాపు 22 బస్సుల వరకు ఉన్నాయి. దీంతో ప్రస్తుతం జిల్లాలో ఇప్పటి వరకు 198 బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించారు. ఇంకా 150 వరకు బస్సులు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించుకోలేదు. ఈ నెల 12న స్కూళ్లు ప్రారంభం కానున్న నేపథ్యంలో పరీక్షలు నిర్వహించుకోవడానికి ఇంకా తొమ్మిది రోజులు మాత్రమే గడువు ఉంది.

గతేడాది పరీక్షలు లేకుండానే..

గత ఏడాది ఫిట్‌నెస్ పరీక్షలు చేయించకుండానే కొన్ని ప్రైవేట్ పాఠశాలలు బస్సులను నడిపినా ఎవరూ పట్టించుకోని పరిస్థితి. ఈ సారైనా అధికారులు దృష్టిసారించి బడి బస్సులన్నింటికీ ఫిట్‌నెస్ పరీక్షలు చేయించి బడి బస్సులు ప్రమాదాల బారిన పడకుండా చూడాలనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

ఫిట్‌నెస్ పరీక్షలు లేకుంటే సీజ్ చేస్తాం

విద్యాసంస్థలు ప్రారంభం నాటికి బడి బస్సులు, ఇతర వాహనాలకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవాలి. గడువు ముగిసిన తర్వాత పరీక్షలకు రాని బస్సులు విద్యార్థులతో రోడ్డెక్కితే సీజ్ చేస్తాం. చట్టప్రకారం కేసులు నమోదు చేస్తాం. ఇప్పటి వరకు ఎన్ని బస్సులు పరీక్షలకు వచ్చాయి..ఎన్ని రాలేదో మా వద్ద వివరాలు ఉన్నాయి.

– సాయికృష్ణ, జిల్లా రవాణాశాఖ అధికారి

ఇవీ..నిబంధనలు..

- 15 ఏళ్ల కాలపరిమితి నిండిన బస్సుల్లో విద్యార్థులను రవాణా చేయడానికి వీల్లేదు.
- ప్రతి వాహనం (ప్రతి బడి బస్సు) పూర్తి కండీషన్‌లో ఉన్నట్టు ఆర్టీఏ అధికారులు ధ్రువీకరించాలి.
- విద్యాసంస్థ పేరు, పూర్తి చిరునామా, ఫోన్ నంబర్ బస్సు ఎడమవైపు ముందు భాగంలో కనిపించేలా ఉండాలి.
- ప్రతి విద్యాసంస్థ బస్సు, ఇతర వాహనం నడిపే వ్యక్తికి ప్రతి మూడు నెలలకు ఒక్కసారి బీపీ, కంటి, మధుమేహం వంటి పరీక్షలు చేయించుకోవాలి.
- వాహనం నడిపే డ్రైవర్‌కు ఐదు ఏళ్ల అనుభవం ఉండాలి.
- బస్సుకు అత్యవసర ద్వారం ఉండాలి.
- ప్రతి వాహనంలో మంటలార్పే పరికరాలు తప్పనిసరిగా ఉండాలి.
- విద్యార్థులు బస్సును ఎక్కడం, దిగడం వంటి దృశ్యాలు డ్రైవర్‌కు కనిపించేలా అద్దం ఏర్పాటు చేసుకోవాలి.
- ప్రతి బస్సులో అటెండర్, విద్యార్థులు పట్టిక ఉండాలి.
- విద్యార్థులు పుస్తకాలను పెట్టుకోవడానికి ప్రత్యేకంగా విభాగాలు ఏర్పాటు చేయాలి.

క్లుప్తంగా

బైక్ అదుపుతప్పి హెడ్‌కానిస్టేబుల్ మృతి


సైదులు (ఫైల్)

కనగల్: విధి నిర్వహణలో భాగంగా బైక్‌పై వెళ్తూ అదుపుతప్పి కింద పడి హెడ్‌కానిస్టేబుల్ మృతిచెందాడు. ఈ ఘటన కనగల్ మండలం దర్వేశిపురం సమీపంలో మంగళవారం జరిగింది. ఎస్ఐ పి. విష్ణుమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. కనగల్ పోలీస్ స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బొల్లేపల్లి సైదులు(47) విధి నిర్వహణలో భాగంగా మంగళవారం ఉదయం జి. చెన్నారం గ్రామంలో పిటిషన్ ఎంక్వైరీ పూర్తిచేసి తిరిగి బైక్‌పై పోలీస్ స్టేషన్‌కు వస్తుండగా.. మార్గమధ్యలో దర్వేశిపురం గ్రామ సమీపంలోని జీఎల్ గార్డెన్స్ వద్ద బైక్ అదుపుతప్పడంతో రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడ్డాడు. మరో కానిస్టేబుల్ రవీందర్‌రెడ్డి గమనించి సైదులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి, 108 వాహనంలో సైదులును నల్లగొండ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

గేదెను ఢీకొని..

గరిడేపల్లి: బైక్‌పై వెళ్తున్న యువకుడు గేదెను ఢీకొట్టి మృతిచెందాడు. ఈ ఘటన సోమవారం రాత్రి గరిడేపల్లి మండలం రాయినిగూడెం గ్రామ శివారులో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదండరాంపురం గ్రామానికి చెందిన మచ్చ మహేష్(32) పని నిమిత్తం సోమవారం మఠంపల్లి మండలంలోని పెదవీడు గ్రామంలో ఉంటున్న తన అమ్మమ్మ ఇంటికి వెళ్లాడు. రాత్రి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా.. గరిడేపల్లి మండలం రాయినిగూడెం గ్రామ శివారులోని రైస్ మిల్లు వద్ద గేదెను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సందీప్ తలకు తీవ్ర గాయాలై స్పృహ తప్పి పడిపోయాడు. స్థానికులు అతడిని 108 వాహనంలో ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

తుంగతుర్తి: తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి ఈ ఘటన తుంగతుర్తి మండలం గానుగుబండ గ్రామంలో సోమవారం రాత్రి జరిగింది. గానుగుబండ గ్రామానికి చెందిన గీత కార్మికుడు పంజాల సోమయ్య రోజుమాదిరిగా సోమవారం సాయంత్రం గ్రామ పరిధిలో తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు చెట్టు పైనుంచి జారి కిందపడ్డాడు. దీంతో అతడి నడుము, వెన్నుపూస, చెయ్యి విరిగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అతడిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. సోమయ్యను ఆస్పత్రిలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు గుండగాని రాములుగౌడ్, గుండగాని కిరణ్‌గౌడ్ పరామర్శించారు.

జూదరులు అరెస్ట్

తిరుమలగిరి(నాగార్జునసాగర్): పేకాట ఆడుతున్న నలుగురు జూదరులను మంగళవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ వీరశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరి(సాగర్) మండల కేంద్రంలోని సందీప్ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి చేయగా.. రంగుండ్ల గ్రామానికి చెందిన ఆంగోతు శ్రవణ్, ఆంగోతు సందీప్, మేరావత్ దస్రూ, ఆంగోతు కిషన్ పట్టుబడ్డారు. వారి నుంచి రూ.4270 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, మూడు బైక్‌లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మిర్యాలగూడ మండలంలో..

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం గ్రామ శివారులోని రాజీవ్ నగర్ గుబ్బీ కాలనీలో పేకాట ఆడుతున్న 8 మందిని సోమవారం రాత్రి మిర్యాలగూడ రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.7600 నగదు, మూడు సెల్‌ఫోన్లు, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మల్లికంటి లక్ష్మయ్య తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

యూట్యూబ్‌లో చూసి నకిలీ విత్తనాల తయారీ

- ముగ్గురి అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు
- రూ.4.62 లక్షల విలువైన 308కేజీల నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ

సూర్యాపేటటౌన్: యూట్యూబ్‌లో చూసి నకిలీ పత్తి విత్తనాలు తయారు చేస్తున్న ముగ్గురు సభ్యుల ముఠాను సూర్యాపేట సీసీఎస్ పోలీసులు, తిరుమలగిరి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి రూ.4.62లక్షల విలువ గల 308 కిలోల నకిలీ పత్తి విత్తనాలు, విత్తనాల తయారీకి ఉపయోగించే మిషన్, ముడిసరుకు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను మంగళవారం సూర్యాపేట జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ నరసింహ విలేకరులకు వెల్లడించారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరి మండల కేంద్రానికి చెందిన సింగారపు యాదగిరిస్వామి తిరుమలగిరి శివారులో భూమి కౌలుకు తీసుకొని పత్తి పంట సాగుచేశాడు. ఆశించినంత దిగుబడి రాకపోవడంతో తాను పండించిన పత్తి నుంచి గింజలు వేరు చేసి, యూట్యూబ్‌లో చూసి పత్తి విత్తనాలు తయారు చేసే మిషన్‌ను కొనుగోలు చేసి నకిలీ పత్తి విత్తనాలను తయారు చేయడం ప్రారంభించాడు.


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నరసింహ, చిత్రంలో పోలీసులు, నిందితులు

మొదట 308 కేజీల నకిలీ పత్తి విత్తనాలను తయారు చేసి ప్యాకింగ్ చేశాడు. వాటిని తనకు పరిచయం ఉన్న నందపురం గ్రామానికి చెందిన నవీన్, చిర్రగూడూరుకు చెందిన సోమనారాయణకు కిలోకు రూ.1500 చొప్పున 10 కిలోలు విక్రయించాడు. వారిద్దరు కలిసి స్థానిక రైతులకు అధిక ధరకు ఈ నకిలీ పత్తి విత్తనాలు విక్రయించి సొమ్ము చేసుకున్నారు. దీంతో మళ్లీ పత్తి విత్తనాలు కావాలని యాదగిరిస్వామిని కోరడంతో.. నవీన్‌కు 50 కిలోలు, సోమనారాయణకు 40 కిలోల నకిలీ పత్తి విత్తనాలు విక్రయించాడు. విశ్వసనీయ సమాచారం మేరకు సూర్యాపేట సీసీఎస్ పోలీసులు, తిరుమలగిరి పోలీసులు యాదగిరి స్వామి కౌలుకు తీసుకున్న భూమిలో తనిఖీలు చేయగా.. నకిలీ పత్తి విత్తనాలు


స్వాధీనం చేసుకున్న నకిలీ పత్తి విత్తనాలు తయారు చేసే మిషన్

తయారుచేస్తూ పట్టుబడ్డాడు. అతడి నుంచి నకిలీ విత్తనాలు తయారుచేసే యంత్రం, విత్తనాల నిగారింపునకు ఉపయోగించే రంగులు, ముడిసరుకుతో పాటు 308 కిలోల నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. యాదగిరి స్వామి ఇచ్చిన సమాచారం మేరకు.. అతడి వద్ద విత్తనాలు కొన్న నవీన్, సోమనారాయణను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. నకిలీ విత్తనాల తయారుచేస్తే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని ఎస్పీ హెచ్చరించారు. జిల్లాలో నకిలీ విత్తనాలను గుర్తించేందుకు టాస్క్‌ఫోర్స్ టీం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. నకిలీ విత్తనాలు తయారుచేసే వారి గురించి సమాచారం ఇస్తే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

30ఏళ్ల కల సాకారం కాబోతోంది

- గంధమల్ల రిజర్వాయర్‌తో ఆలేరు సస్యశ్యామలం
- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

సాక్షి, యాదాద్రి: ఆలేరు నియోజకవర్గ ప్రజల 30ఏళ్ల కలను సీఎం రేవంత్‌రెడ్డి సాకారం చేయబోతున్నారని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. తుర్కపల్లి మండలం తిర్మలాపురం వద్ద 6వ తేదీన నిర్వహించనున్న సీఎం బహిరంగ సభకు సంబంధించిన ఏర్పాట్లను మంగళవారం సాయంత్రం వారు పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. రూ.1,500 కోట్లతో ఆలేరు నియోజకవర్గంలో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సీఎం రేవంత్‌రెడ్డి 6న శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఇందులో ప్రధానంగా గంధమల్ల రిజర్వాయర్, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, యాదాద్రి మెడికల్ కళాశాల, వేద పాఠశాల, ధాన్యం గోదాములు, మోటకొండూరులో పోలీస్ స్టేషన్, తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయ భవనాలకు భూమి పూజ చేస్తారన్నారు. అదే విధంగా పలు రోడ్లు, కొలనుపాక, పాట్టి మర్రివద్ద హైలెవల్ బ్రిడ్జిలకు శంకుస్థాపన చేస్తారన్నారు. గంధమల రిజర్వాయర్‌తో ఆలేరు ప్రాంతం సస్యశ్యామలం కానుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆలేరు నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వమే ఆలేరుకు పెద్దఎత్తున నిధులు కేటాయిస్తోందన్నారు. మూసీ ప్రక్షాళనతో పాటు ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం పంపిణీతో ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్నారు. సీఎం బహిరంగ సభకు రైతులు, యువకులు, ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, మదర్ డెయిరీ చైర్మన్ గుడిపాటి మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న బీర్ల ఐలయ్య, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

సూర్యాపేటటౌన్: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సూర్యాపేట పట్టణంలోని పొట్టి శ్రీరాములు సెంటర్‌లో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట పట్టణంలోని అఫ్జల్ రైస్‌మిల్లు ప్రాంతానికి చెందిన సారగండ్ల సాయికుమార్(29) నాలుగేళ్లుగా స్థానిక పొట్టి శ్రీరాములు సెంటర్‌లో ఐఫోన్ టెక్(ఆండ్రాయిడ్ హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్) షాపు నిర్వహిస్తున్నాడు. అయితే మంగళవారం మధ్యాహ్నం సాయికుమార్ షాపు షట్టర్ కిందికి వేసి లోపల ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు సాయికుమార్‌కు ఫోన్ చేసినా ఎత్తకపోవడంతో అనుమానం వచ్చి షాపు వద్దకు రాగా అతడి బైక్ అక్కడే ఉంది. షాప్ మూసి వేసి ఉండటంతో చుట్టుపక్కల వారి సహాయంతో షట్టర్‌ను తీయగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. సాయికుమార్ ఐదు నెలల క్రితం శివాని అనే అమ్మాయిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. తన కుమారుడి మృతి పట్ల అనుమానాలు ఉన్నట్లు అతడి తల్లి విజయ సూర్యాపేట టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

జాతీయ బీచ్ కబడ్డీ పోటీలకు అంపైర్‌గా వీరస్వామి


వీరస్వామి

గరిడేపల్లి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మచిలీపట్నం బీచ్‌లో 5వ తేదీ నుంచి 8వ తేదీ వరకు జరగనున్న 12వ జాతీయ స్థాయి బీచ్ కబడ్డీ పోటీలకు టెక్నికల్ ఆఫీషియల్(అంపైర్)గా గరిడేపల్లి మండలం రంగాపురం గ్రామానికి చెందిన కొంపెల్లి వీరస్వామి ఎంపికైనట్లు తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కాసాని వీరేశం ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి మహేందర్‌రెడ్డి తెలిపారు. వీరస్వామి గతంలో 49వ జూనియర్ జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో, వివిధ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో రెఫరీగా వ్యవహరించినట్లు వారు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో నలుగురికి జైలుశిక్ష

కోదాడరూరల్: డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన నలుగురికి ఒకరోజు జైలుశిక్ష విధిస్తూ కోదాడ కోర్టు సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ సత్యనారాయణ మంగళవారం తీర్పు వెలువరించారు. కోదాడ పట్టణ సీఐ శివశంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం రాత్రి కోదాడ పట్టణంలోని ఖమ్మం క్రాస్‌రోడ్, రంగా థియేటర్ సెంటర్‌లో ట్రాఫిక్ ఎస్ఐ మల్లేష్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా.. ఐదుగురు వ్యక్తులు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని మంగళవాంర కోదాడ కోర్టులో హాజరుపర్చగా నలుగురికి ఒకరోజు జైలు శిక్షతో పాటు ఐదుగురికి రూ.2వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చినట్లు సీఐ తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో మినీ సర్వీస్ బ్యాంకు దగ్ధం

పెద్దవూర: మండల కేంద్రంలోని మినీ సర్వీస్ బ్యాంకు మంగళవారం సాయంత్రం షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. పులిచర్ల ఎస్‌బీఐ బ్యాంకు ఆధ్వర్యంలో ఎస్‌బీఐ వినియోగదారుల కోసం పెద్దవూర మండల కేంద్రంలోని శ్రీకోదండరామాలయం సమీపంలో మినీ సర్వీస్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మంగళవారం సాయంత్రం అందులో షార్ట్ సర్క్యూట్ అయ్యి మంటలు వ్యాపించాయి. దీంతో ఫ్రిడ్జ్, రెండు కంప్యూటర్లు, ల్యాప్‌ట్యాప్‌లు, ప్రింటర్లు, కౌంటర్, నాలుగు కుర్చీలు పూర్తిగా కాలిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పక్కనే డబ్బాలకు మంటలు వ్యాపించకుండా చర్యలు తీసుకున్నారు. సుమారు రూ.2లక్షల నష్టం వాటిల్లినట్లు నిర్వాహకుడు చిట్టిమల్ల సరేష్ తెలిపారు.


దగ్ధమవుతున్న మినీ సర్వీస్ బ్యాంకు

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ బాధితుడికి అప్పగింత

దేవరకొండ: దేవరకొండ ఆర్టీసీ బస్టాండ్‌లో మంగళవారం ప్రయాణికుడు పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను ఆర్టీసీ అధికారులు తిరిగి అతడికి అప్పగించారు. వివరాలు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా మాచర్లకు చెందిన సుబ్బారావు కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం దేవరకొండకు వచ్చాడు. అక్కడ పని ముగించుకుని నల్లగొండకు వెళ్లేందుకు గాను దేవరకొండ బస్టాండ్‌లో బస్సు ఎక్కాడు. ఈ క్రమంలో తన రూ.30వేల విలువైన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. దేవరకొండ బస్టాండ్‌లో స్వీపర్‌గా పనిచేస్తున్న ముత్తమ్మకు ఆ ఫోన్ దొరకడంతో ఆమె డిపో అధికారులకు అందించింది. డిపో అసిస్టెంట్ మేనేజర్ పడాల సైదులు ఫోన్ నంబర్ ఆధారంగా వివరాలు సేకరించి సుబ్బారావుకు సెల్‌ఫోన్ అప్పగించారు. నిజాయితీ చాటుకున్న ముత్తమ్మను ఆర్టీసీ అధికారులు అభినందించారు.


సుబ్బారావుకు సెల్‌ఫోన్ అందిస్తున్న దేవరకొండ అసిస్టెంట్ డిపో మేనేజర్ సైదులు

వివాహేతర సంబంధం అంటగట్టాడని..

- ఆటో డ్రైవర్‌ను హత్య చేసిన తోటి ఆటో డ్రైవర్
- నిందితుడితో పాటు అతడికి సహకరించిన వ్యక్తిని అరెస్ట్ చేసిన పోలీసులు
- రిమాండ్‌కు తరలింపు

చౌటుప్పల్ రూరల్: వివాహేతర సంబంధం అంటగట్టి తన పరువు తీశాడని ఆటో డ్రైవర్‌ను హత్య చేసిన తోటి ఆటో డ్రైవర్‌ను, అతడికి సహకరించిన మరో వ్యక్తిని మంగళవారం చౌటుప్పల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన మారోజు రమేష్(33) బతుకుదెరువు నిమిత్తం కొన్నేళ్ల క్రితం హైదరాబాద్‌లోని చంపాపేట పరిధిలోని దోబీఘాట్ ప్రాంతానికి వలస వచ్చాడు. ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్న రమేష్ నల్లగొండ జిల్లా గట్టుప్పల్ మండలం అంతంపేట గ్రామానికి చెందిన లెంకలపల్లి భాస్కర్ వద్ద ఆటోను రోజువారీగా అద్దెకు తీసుకొని నడుపుకునేవాడు. రమేష్ పలుమార్లు ఆటోతో ప్రమాదాలు చేసి తీసుకురావడంతో పాటు దానికి రిపేర్‌కు అయ్యే ఖర్చులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నాడు. ఈ క్రమంలో భాస్కర్ డబ్బుల కోసం రమేష్ ఇంటి వద్ద లేని సమయంలో అతడి ఇంటికి వెళ్లి గొడవ చేసేవాడు. తాను ఇంటి వద్ద లేని సమయంలో భాస్కర్ ఇంటికి రావడంతో తన భార్యతో వివాహేతర సంబంధం నడుపుతున్నాడనే అనుమానంతో రమేష్ ఆటో అడ్డా వద్ద తోటి డ్రైవర్లకు భాస్కర్ గురించి తప్పుగా చెప్పేవాడు. రమేష్ తనకు ఇచ్చే డబ్బులు ఇవ్వకపోగా.. తన పరువు తీసేలా వివాహేతర సంబంధం అంటగట్టడంతో భాస్కర్ రమేష్‌పై కక్ష పెంచుకున్నాడు. ఎలాగైనా రమేష్‌ను హత్య చేయాలని భావించి హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్ ప్రాంతంలోని గుంటి జంగయ్య కాలనీకి చెందిన మరో ఆటో డ్రైవర్ ఎండీ రియాజ్ సహకారంతో రమేష్‌ను గత నెల 25న ఎల్‌బీనగర్‌కు పిలిపించాడు. ముగ్గురు కలిసి మద్యం తాగారు. అనంతరం అక్కడి నుంచి చౌటుప్పల్ మండలం తుఫ్రాన్‌పేట గ్రామ పరిధిలోని గ్రీన్ సిటీ వెంచర్‌లోకి వచ్చి అక్కడ కూడా మద్యం తాగారు. ఈ సమయంలో భాస్కర్, రమేష్ మధ్య మాటామాట పెరిగింది. దీంతో భాస్కర్, ఎండీ రియాజ్ అక్కడే ఉన్న ఉల్లిపాయల బస్తాతో రమేష్‌కు ఉరి వేసి హత్య చేశారు. అనంతరం రమేష్ ముఖంపై బండరాళ్లతో మోదారు. రమేష్ మృతిచెందాడని నిర్ధారించుకుని అక్కడి నుంచి ఎల్‌బీనగర్‌కు వెళ్లిపోయారు. గ్రీన్ సిటీ వెంచర్‌లో గత నెల 30న వ్యక్తి మృతదేహం లభ్యం కావడంతో చౌటుప్పల్ పోలీసులు గుర్తుతెలియని మృతదేహంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం మృతదేహం లభ్యమైన ప్రదేశానికి వెళ్లి పోలీసులు ఆధారాలు సేకరిస్తుండగా.. భాస్కర్, ఎండీ రియాజ్ అక్కడ అనుమానాస్పదంగా తిరుగుతూ పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశారు. పోలీసులు వారిని పట్టుకుని విచారించగా.. హత్య చేసింది తామేనని నిజం ఒప్పుకున్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

భువనగిరి: టిప్పర్ ఢీకొని మోపెడ్‌పై వెళ్తున్న వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన భువనగిరి మండలం వడాయిగూడెం వద్ద మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిగుట్టకు చెందిన కీర్తి వెంకటేశ్వర్లు(60) మంగళవారం ఉదయం పని నిమిత్తం మోపెడ్‌పై వడాయిగూడెం గ్రామానికి వెళ్లాడు. అక్కడ పని ముగించుకుని తిరిగి స్వగ్రామానికి వస్తుండగా.. వడాయిగూడెం గ్రామ స్టేజీ వద్ద యూటర్న్ తీసుకుంటుండగా, యాదగిరిగుట్ట నుంచి రాయగిరికి వెళ్తున్న టిప్పర్‌ను డ్రైవర్ అజాగ్రత్తగా, వేగంగా నడిపి మోపెడ్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ అనిల్‌కుమార్ తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..


శ్రీను (ఫైల్)

నాగారం: రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన సోమవారం అర్ధరాత్రి సూర్యాపేట-జనగామ జాతీయ రహదారిపై నాగారం బంగ్లా పరిధిలోని విజయనగర్ కాలనీ వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగారం మండల పరిధిలోని పసునూర్ గ్రామానికి చెందిన కడారి శ్రీను(45) కొంత కాలంగా హైదరాబాద్‌లోని బీఎస్‌రెడ్డి కాలనీలో నివాసముంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం నాగారం మండలం డి. కొత్తపల్లి గ్రామంలో గంగదేవమ్మ పండుగ చేయడంతో తన బంధువైన బీసు నర్సయ్య ఇంటికి వచ్చాడు. రాత్రి 1:30 గంటల సమయంలో తిరిగి హైదరాబాద్‌కు వెళ్లేందుకు నడుచుకుంటూ నాగారం వైపు వస్తుండగా.. మార్గమధ్యలో నాగారం బంగ్లా పరిధిలోని విజయనగర్ కాలనీ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. మంగళవారం తెల్లవారుజామున స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వగా.. వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడుకి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి పెద్ద కుమారుడు సాయికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఐలయ్య తెలిపారు.

రన్నరప్‌గా నిలిచిన నల్లగొండ ఎఫ్‌సీఐ ఉద్యోగులు

నల్లగొండ: ఇటీవల తమిళనాడు రాజధాని చెన్నైలో నిర్వహించిన ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) సౌత్‌జోన్ ఇండోర్ బ్యాడ్మింటన్ పోటీల్లో రన్నరప్‌గా నిలిచిన నల్లగొడ జిల్లా ఎఫ్‌సీఐ ఉద్యోగులు రఘురామ్, ధీరజ్‌ను మంగళవారం జిల్లా కార్యాలయంలో సంస్థ నల్లగొండ డివిజన్ మేనేజర్ సువీన్‌కుమార్ అభినందించారు. ఎఫ్‌సీఐలో ప్రతిభ గల క్రీడాకారులకు తమ మద్దతు ఉంటుందని, ఇదే స్ఫూర్తితో మరిన్ని విజయాలు సాధించాలని ఉద్యోగులను ఆయన ప్రశంసించారు.


రన్నరప్‌గా నిలిచిన ఎఫ్‌సీఐ ఉద్యోగులను అభినందిస్తున్న సువీన్‌కుమార్

తాళం వేసిన ఇంట్లో చోరీ

- 7 తులాల బంగారు, 60తులాల వెండి ఆభరణాలు, రూ.2లక్షల నగదు అపహరణ

ఆలేరు: తాళం వేసిన ఇంట్లోకి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి బంగారు, వెండి ఆభరణాలతో పాటు నగదును అపహరించారు. ఈ ఘటన ఆలేరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. మంగళవారం సీఐ కొండల్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలేరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్సీ కాలనీలో నివాసముంటున్న సీఆర్‌పీఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ తాటికాయల రమేష్ తన కుటుంబంతో కలిసి ఈ నెల 1వ తేదీన ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌కు వెళ్లాడు. ఇది గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు అదేరోజు రాత్రి రమేష్ ఇంటి తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించి బీరువాలోని ఏడు తులాల బంగారు, 60 తులాల వెండి ఆభరణాలతో పాటు రూ.2లక్షల నగదును ఎత్తుకెళ్లారు. పక్కింట్లోనే ఉంటున్న రమేష్ తల్లి సోమవారం ఉదయం రమేష్ ఇంటి తలుపు తెరిచి ఉండటాన్ని గమనించి వెంటనే కొడుకుకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చింది. రమేష్ ఇంటికి వచ్చి చూసి చోరీ జరిగినట్లు గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. యాదగిరిగుట్ట ఏసీపీ శ్రీనివాస్‌నాయుడు, సీఐ కొండల్‌రావు ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. క్లూస్ టీంను పిలిపించి ఆధారాలు సేకరించారు. నిందితులను పట్టుకునేందుకు చుట్టుపక్కల సీసీ కెమెరాల ఫుటేజీని పోలీసులు పరిశీలిస్తున్నారు. రమేష్ భార్య దీపకళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


వివరాలు సేకరిస్తున్న యాదగిరిగుట్ట ఏసీపీ శ్రీనివాస్‌నాయుడు, ఆలేరు సీఐ కొండల్‌రావు

డాక్టర్ ఆఫ్ సోషల్ వర్కర్ అవార్డుకు ఎంపిక

చౌటుప్పల్: చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పంతంగి లక్ష్మణ్‌రావు(పీఎల్ఎన్ రావు)కు డాక్టర్ ఆఫ్ సోషల్ వర్కర్-2025 అవార్డు లభించింది. జర్మనీ దేశానికి చెందిన యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ పీస్ యూనివర్సిటీ మంగళవారం ఆయనకు ఈ అవార్డును ప్రదానం చేసింది. ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ పలు అంశాలను ఎంపిక చేసి ఆయా అంశాల్లో వ్యక్తులు, సంస్థలు అందిస్తున్న సేవలను గుర్తించి వారికి అవార్డులను అందజేస్తున్నారు. అందులో భాగంగా దక్షిణ భారతదేశ స్థాయిలో తమిళనాడు రాష్ట్రంలోని ఊటీలో గత మూడు రోజులుగా ప్రత్యేక సదస్సు నిర్వహించారు. అందులో భాగంగా గత 20 ఏళ్లుగా పర్యావరణంపై అనేక రకాల కార్యక్రమాలు చేపడుతూ ప్రజలను చైతన్యం చేయడంతో పాటు పలు సామాజిక అంశాలపై కూడా పనిచేస్తున్న లక్ష్మణ్‌రావు సేవలను గుర్తించిన ఆ సంస్థ ఆయనను ఈ అవార్డుకు ఎంపిక చేసింది. ఈ మేరకు యూనివర్సిటీ ప్రతినిధులు ఆయనకు మంగళవారం ఊటీలో అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ.. పర్యావరణ హితం కోరుతూ గత ఇరవై ఏళ్లుగా అనేక కార్యక్రమాలు చేపట్టామని, రానున్న రోజుల్లో మరిన్ని నిర్వహిస్తామని తెలిపారు.


అవార్డు అందుకుంటున్న పంతంగి లక్ష్మణ్‌రావు

యాదగిరిగుట్టలో భక్తుల కిటకిట

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం సైతం భక్తులు కిటకిటలాడారు. వేసవి సెలవులు ముగుస్తుండడంతో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారి ధర్మ దర్శనానికి 3గంటలు, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టినట్లు భక్తులు పేర్కొన్నారు. స్వామివారిని 30 వేల మందికి పైగా భక్తులు దర్శించుకున్నారు. వివిధ పూజలతో నిత్యాదాయం రూ.30,63,574 వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.


ఆలయ పరిసరాల్లో కిటకిటలాడుతున్న భక్తులు

దాతలూ.. సాయం చేయరూ..

- తలసేమియా వ్యాధితో బాధపడుతున్న 11ఏళ్ల బాలుడు
- రూ.5లక్షల వరకు ఖర్చు చేసిన తల్లిదండ్రులు
- ఆపరేషన్‌కు రూ.25లక్షలు అవసరం

కన్నీటి గాథ

మర్రిగూడ: కూలీ పనులు చేసుకుంటూ ఉన్నంతలో తృప్తిగా బతుకుతున్న ఆ కుటుంబానికి పెద్ద కష్టం వచ్చి పడింది. కుమారుడికి తలసేమియా వ్యాధి సోకడంతో ఒక్కసారిగా ఆ కుటుంబం స్థితిగతులు చిన్నాభిన్నమయ్యాయి. వివరాలు.. మర్రిగూడ మండలం శివన్నగూడ గ్రామానికి చెందిన బల్లెం అబ్బయ్య, స్వరూప దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం. పెద్ద కుమారుడు బల్లెం ప్రణయ్ గతేడాది వినాయక నిమజ్జనం రోజు నీరసించడంతో తల్లిదండ్రులు వైద్యులను సంప్రదించగా తలసేమియా వ్యాధి సోకినట్లు నిర్ధారించారు. తలసేమియా సోకిన రోగికి 15 రోజులకొకసారి కొత్త రక్తం ఎక్కించాలి. ప్రణయ్‌కి తలసేమియా వ్యాధి సోకినట్లు తెలిసినప్పటి నుంచి ఇప్పటివరకు వైద్య పరీక్షలు, మందులు 70 ప్యాకెట్ల రక్తం ఎక్కించినందుకుగాను రూ.5లక్షల వరకు ఖర్చు చేశారు.

బైక్, బంగారం అమ్మి..

కూలీ పనులకు వెళ్తే వచ్చే డబ్బులు సరిపోకపోవడంతో అబ్బయ్య తన బైక్, స్వరూప తన బంగారాన్ని అమ్మి మరీ ప్రణయ్‌కి వైద్యం చేయించారు. గ్రామానికి చెందిన పలువురు రూ.లక్ష వరకు, సమీప బంధువులు రూ.50వేల వరకు ఆర్థికసాయం అందజేశారు. అంతేకాకుండా అప్పులు తెచ్చి కూడా తెచ్చారు. ఉండడానికి కనీసం ఇల్లు కూడా లేకపోవడంతో కిరాయి ఇంట్లో నివాసముంటున్నారు.

దాతలు దయతలిస్తేనే...

హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆస్పత్రిలో ప్రణయ్‌కి వైద్య సేవలు అందుతున్నప్పటికీ.. సమయానికి రక్తం, మందులు లభించకపోవడంతో ప్రైవేట్‌గా కొనుగోలు చేయాల్సి వస్తుందని అబ్బయ్య, స్వరూప వాపోతున్నారు. ఆపరేషన్‌కు రూ.25లక్షలు అవసరమని అందులో రూ.20లక్షలు ప్రభుత్వం సహకరిస్తే.. మరో రూ.5లక్షల కోసం దాతల సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. దయార్ధ హృదయులు సాయం చేసి తమ కుమారుడి ప్రాణాలు కాపాడాలని అబ్బయ్య, స్వరూప కోరుతున్నారు.


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రణయ్